

అసిస్టెంట్ జీపీగా వెంకటరావు

శ్రీకాకుళం లీగల్ మే 15(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పిండి వెంకటరావు నియమితులయ్యారు. జిల్లాలో న్యాయాధికారుల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఈమేరకు పలాసలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా వెంకటరావును నియమిస్తూ గురువారం న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి గొట్టాపు ప్రతిభాదేవి ఉత్తర్వులను జారీచేశారు. ఏజీపీగా మూడేళ్లపాటు వెంకటరావు కొనసాగనున్నారు. ప్రభుత్వం ఆయనకు గౌరవవేతనంగా నెలకు రూ.10వేలు చొప్పున చెల్లించనుంది.

మూడు విడతలు.. ఒకేసారి



- ఇకపై ముందుగానే గ్యాస్ సిలిండర్ల రాయితీ డబ్బులు జమ
- పొలిట్‌బ్యూరో సమావేశంలో నిర్ణయం
- లబ్ధిదారులకు తప్పనున్న ఇబ్బందులు

● మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన బైపోతు సావిత్రమ్మకు గ్యాస్ కనెక్షన్ ఉంది. అన్ని అర్హతలు ఉన్నా.. ప్రభుత్వం ప్రకటించే ఉచిత సిలిండర్‌కు సంబంధించి తొలివిడత రాయితీ డబ్బులు ఆమె బ్యాంకు ఖాతాకు జమ కాలేదు. దీంతో గ్యాస్ కార్యాలయంతోపాటు బ్యాంకులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది.

● మెళియాపుట్టి మండలం జలగలింగుపురానికి చెందిన నడిమింటి సరోజినికి కూడా మొదటి విడత గ్యాస్ రాయితీ డబ్బులు జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీకి, బ్యాంకు వద్దకు వెళ్లి అడిగినా సమస్య పరిష్కారం కాలేదు. రాయితీ డబ్బులు పడకపోవడంతో ఆమె దిగులు చెందుతోంది.

మెళియాపుట్టి, మే 15(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో చాలామంది వినియోగదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ డబ్బులు జమకాక ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల ఉచిత సిలిండర్ల డబ్బులను ఒకేసారి.. అదీ ముందుగానే వినియోగదారుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో దీపం-2 పథకం ద్వారా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు గతేడాది నవంబరు 1న ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురంలో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించారు. నవంబరు నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు తొలివిడత కింద వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో సిలిండర్ రాయితీ డబ్బులు జమ చేశారు. కాగా.. సాంకేతిక ఇబ్బందుల కారణంగా చాలామంది వినియోగదారుల ఖాతాల్లో తొలివిడత రాయితీ డబ్బులు జమకాలేదు. జిల్లాలో 6,92,825 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలివిడత రాయితీ 4,35,992 మందికి మాత్రమే రూ.33.31 కోట్లు జమయినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 2.30 లక్షల మందికి మాత్రమే రాయితీ అందినట్టు తెలుస్తోంది. మిగిలిన వారంతా రాయితీ (మిగతా 6వ పేజీలో..)

సాంకేతిక సమస్య పరిష్కరించాలి

వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలామంది వినియోగదారులు గ్యాస్ కార్యాలయాల వద్ద ఈకేవైసీ ప్రక్రియ నమోదు చేయించుకోలేదు. దీంతో అర్హత ఉన్నా.. రాయితీ డబ్బులు జమకావడం లేదు. ఈ నేపథ్యంలో సచివాలయ అధికారులకు బయోమెట్రిక్ అమలు బాధ్యత అప్పగిస్తే.. వృద్ధులైన చాలామంది వినియోగదారులకు ఉపశమనం లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. అలాగే జిల్లాలో వివిధ సాంకేతిక కారణాలతో చాలామంది రాయితీకి దూరమయ్యారు. ఆ సాంకేతిక సమస్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. రాయితీ అందనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించి.. సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయంలో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

కొత్త రేషన్ కార్డులకు సర్వర్ సమస్య..

మెళియాపుట్టి, మే15(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుకు సర్వర్ సమస్య వేధిస్తోంది. దీంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం ఈనెల 6 నుంచి సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అలాగే పేర్లు, చిరునామా మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించింది. దీంతో అధికసంఖ్యలో దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్తున్నారు. ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నమోదు చేస్తున్నా సర్వర్ సమస్య కారణంగా ఆ వివరాలను అంగీకరించడం లేదని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ఇటువంటి పరిస్థితే నెలకొనడంతో దూరప్రాంతాల నుంచి వచ్చినవారు వెనుతిరుగుతున్నారు. నూతన దంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్ ఉంటేనే రేషన్‌కార్డులకు అర్హులు. దీంతో వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పరుగులు తీసున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుల సమస్యను పరిష్కరించకపోవడంతో ఒకేసారి అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని, దీనివల్ల సర్వర్ సమస్య తలెత్తుతుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై సీఎస్ డీటీ ప్రసాదరావును వివరణ కోరగా.. 'సాఫ్ట్‌వేర్ అంతా అమరావతిలో ఉంటుంది. ఇక్కడ చేయడానికి ఎటువంటి ఆప్షన్ ఇవ్వలేదు. అందరూ ఒకేసారి దరఖాస్తు చేస్తుండడంతో సర్వర్ బిజీ వస్తుంది' అని తెలిపారు.



మూలపేట పోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బొహరా

పోర్టు పనుల పరిశీలన

టెక్కలి, మే 15(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టును వాల్తేర్ రైల్వే డీఆర్ఎం లలిత్‌బొహరా సంబంధిత అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. రెవెన్యూ అధికారులు పోర్టుకు అవసరమైన రైల్వేలైన్ కోసం 72 ఎకరాలు భూసేకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పోర్టు నిర్మాణం తరువాత లోడింగ్ అంశాలు, కంటైనర్ బెర్త్, కోల్, మల్టీపర్పజ్ ఖార్గోబెర్త్‌ల పరిస్థితులపై డీఆర్ఎం సమీక్షించారు. 43 బిలియన్లతో పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు గుర్తించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్యశాఖ ద్వారా ఇటీవల వెలువడిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్, ఎల్ఎస్‌జీ పోస్టుల భర్తీలో దళారులను నమ్మి మోసపోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత తెలిపారు. ప్రతిభ ఆధారంగానే పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఎవరైనా దళారులు మెరిట్‌లో వచ్చినవారికి ఫోన్లు చేస్తే వెంటనే వారి వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 15(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12గంటల వరకు వినతుల స్వీకరణ ఉంటుందని, విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవుడికీ దించండీ నారాయణా

- ఉద్దానం ప్రాంతంలో విరివిగా 'దేవుడి సంబరాలు'
- కళకళలాడుతున్న పల్లెలు ● వారంలో మూడు రోజులు సందడే

6లో

జీడికి గిట్టుబాటు లభించేనా?

- మద్దతు ధర కోసం రైతుల ఎదురుచూపు
- రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్
- సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



పలాస, మే 15(ఆంధ్రజ్యోతి):

జీడిపిక్కల గిట్టుబాటు ధర రూ.16వేలు పలుకుతుందనే ఆశతో రైతులు ఉన్నారు. ప్రస్తుతం జీడిపిక్కల బస్తా (80 కేజీలు) రూ.13,500 ఉండగా కొంతమంది విక్రయాలు సాగిస్తున్నారు. మరికొందరు మాత్రం గిట్టుబాటు ధర పెరుగుతుందని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 30వేల హెక్టార్లలో జీడి సాగవుతోంది. ఉద్దానం ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో సుమారు 30వేల మందికిపైగా రైతులు జీడి పంటపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక వారి పరిస్థితి దయనీయంగా మారింది. డిసెంబరు నుంచి మే నెల వరకూ జీడి సీజనుగా పిలుస్తారు. ఎకరా జీడి పంటకు 4 నుంచి 6 బస్తాల పిక్కలు పండుతాయి. సరాసరి ఎకరాకు రూ.18వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం ప్రతికూల వాతావరణం ఉండడంతో ఎకరాకు 2 బస్తాలు మాత్రమే పండుతున్నాయి. గతంలో మార్కెట్‌లో బస్తా పిక్కలు ధర రూ.12 వేల నుంచి రూ.14వేల వరకూ ఉండగా.. ప్రస్తుతం రూ.13,500 వరకూ ఉంది. దీంతో తమకు పెట్టుబడికే ఆ డబ్బులు సరిపోతున్నాయని, కనీసం లాభం లేకపోతే కష్టపడి పండించిన ప్రయోజనమేంటని రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో జీడిపప్పు రూ.800 వరకూ ఉంది. దాని ప్రకారం జీడిపిక్కల ధరలు కూడా పెరగాల్సి ఉందని రైతులు పేర్కొంటున్నారు.

విదేశీ జీడి పిక్కలపైనే మోజు..

పలాస జీడి పరిశ్రమలకు విదేశీ జీడిపిక్కలు బస్తా రూ.12వేలకు లభ్యమవుతోంది. దీంతో స్వదేశీ జీడిపిక్కలను కొనుగోలుకు వ్యాపారులు ఇష్టపడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఇటీవల జీడిపప్పు కూడా అక్రమ మార్గంలో పలాసకు చేరుకుంటుండడంతో స్థానికంగా తయారవుతున్న జీడిపప్పు మార్కెట్ ఒక్కసారిగా పతనమైందని వ్యాపారులు అభిప్రాయాన్ని వ్యాపారులూ వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో పండే జీడిపిక్కలు ఇక్కడున్న జీడి పరిశ్రమలకు కేవలం వంద రోజుల వరకే వస్తుంది. దీంతో విదేశీ పిక్కలు తీసుకురావడం అనివార్యమైంది. ఇదే అదనుగా ఆరుగాలం కష్టపడి పండించే మన జీడిపిక్కల అవసరం అంతంత మాత్రమైంది. విదేశీ జీడిపిక్కల కన్నా మన పిక్కలు నాణ్యతగా ఉంటాయి. రుచిలో కూడా భారీ తేడా ఉంటుంది. విదేశీ పప్పు పరిమాణంలో పెద్దదిగాను, రంగులో కూడా తేడా ఉండడంతో ఏది స్థానికం, ఏది విదేశీ అన్న తేడా కనిపించకపోవడంతో చౌకగా లభించే విదేశీ పిక్కలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.



ఇక్కడున్న పది మంది బ్రోకర్లు వేల టన్నుల పిక్కలు తీసుకువస్తూ పలాస మార్కెట్‌ను శాసిస్తున్నారు. దీంతో రైతుల వద్ద ఉండాల్సిన ధరలు వారి వద్దే కేంద్రీకృతం కావడంతో మన జీడిపప్పునకు మార్కెట్ తగ్గిపోయింది. దీంతో తాము పండించే జీడిపిక్కలకు గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విదేశీ మోజులో స్థానిక జీడిపిక్కల ధరలు పతనమయ్యాయని ఆరోపిస్తున్నారు. ఏడాదిపాటు విదేశీ పిక్కలను వినియోగించకుండా చర్యలు చేపడితే తాము పండించేవాటికి గిట్టుబాటు ధర పెరుగుతుందని పేర్కొంటున్నారు. 'బస్తాకు కనీసం గిట్టుబాటు ధర రూ.16వేలు కల్పించాలి. జీడిపిక్కలను నేరుగా ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి. జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. మేలురకమైన జీడి వంగడాలు అందించాలి' రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏపీ ఈసెట్‌లో సిక్కోలు సత్తా

- 92.97 శాతం ఉత్తీర్ణత

శ్రీకాకుళం/ ఎచ్చెర్ల/ పొందూరు/ ఆమదాలవలస/ జలుమూరు/ కంచిలి, మే 15(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సును పూర్తిచేసి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరేందుకు నిర్వహించిన ఏపీ ఈసెట్ -2025 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. 'జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ' ఏపీ ఈసెట్‌ను నిర్వహించింది. జిల్లా నుంచి 1,671 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బాలురు 1,178 మంది, బాలికలు 493 మంది ఉన్నారు. పరీక్షకు 1,621 మంది మాత్రమే హాజరయ్యారు. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. 1049 మంది బాలురు, 458 మంది బాలికలు మొత్తం 1507 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 92.97 శాతం ఉత్తీర్ణత లభించింది.



హేమలత

● శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగానికి చెందిన సీపాన హేమప్రియ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, రంగల హేమలత ఏడో ర్యాంకు, ఫార్మసీ విభాగంలో కె.భార్గవి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు దక్కించుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో వైప్రవళ్లిక 36వ ర్యాంకు, ఇతనూజ 42వ ర్యాంకు సాధించారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ టి.విక్టర్‌బాబు, వివిధ కోర్సుల విభాగాధిపతులు ఆర్డీఎల్సీ క్రిస్టియన్, పి.కవిత, జి.గోవిందనాయుడు అభినందించారు. అలాగే కుశాలపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చెందిన విద్యార్థులు కూడా ప్రతిభ చూపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో గ్రంధి జ్ఞానేశ్వర్‌లో 68వ ర్యాంకు, బరాటం సిరి 100వ ర్యాంకు, పి.తపన్ సిద్ధార్థ 109వ ర్యాంకు, ఎం.బాలరాజు 146వ ర్యాంకు సాధించారు.



హేమప్రియ.. 2వ ర్యాంకు

పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన సీపాన హేమప్రియ.. తండ్రి లేకపోయినా తల్లికష్టాన్ని గుర్తించి బాగా చదువుకుంది. పాలిటెక్నిక్ చదివినా.. ఉన్నత కొలువే లక్ష్యంగా ఇంజనీరింగ్ చేయాలనే ఉద్దేశంతో ఈసెట్ రాసింది. ఎలక్ట్రానిక్ అండ్ ఇనిస్ట్రుమెంటేషన్ విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. హేమప్రియ తండ్రి ప్రభాకరరావు కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. తల్లి జ్యోతి టైలర్ వృత్తి చేస్తూ.. హేమప్రియను చదివించింది. 1 నుంచి 5వ తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం సాగింది. 6 నుంచి పదో తరగతి వరకు విజయనగరం జిల్లా మెంటాడలోని కేజీబీవీలో చదివింది. పదోతరగతిలో 550 మార్కులు సాధించింది. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఆమె ఈసెట్ రాయగా.. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ రావడతో తల్లి జ్యోతి ఆనందానికి అవధుల్లేవు. హేమప్రియను గ్రామస్తులు అభినందించారు.



భార్గవి.. 3వ ర్యాంకు

ఆమదాలవలసలోని ఐజేనాయుడు కాలనీకి చెందిన కూన భార్గవి ఈసెట్‌లో.. డీ-ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడోర్యాంకు సాధించింది. ఈమె పట్నంలోని లక్ష్మీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివింది. ప్రస్తుతంలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోంది. తండ్రి నర్సింగరావు పూల వ్యాపారి. తల్లి రమణమ్మ గృహిణి. భార్గవికి వివాహమైంది. భర్త రమేష్‌కుమార్, అత్తమామల ప్రోత్సాహంతో తాను చదువును కొనసాగిస్తు న్నానని భార్గవి తెలిపింది. ఉత్తమ ర్యాంకు సాధించినం దుకు కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను అభినందించారు.



శరత్‌కుమార్.. 9వ ర్యాంకు

కంచిలి మండలం బసవపుట్టుగ గ్రామానికి చెందిన కాంట్రెడ్డి శరత్‌కుమార్ ఈసెట్‌లోని సీఎస్‌సీ విభాగంలో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించాడు. తండ్రి రాజారావు ఎలక్ట్రీషియన్. తల్లి డిల్లమ్మ గృహిణి. శరత్‌కుమార్ పెద్ద అక్క నీలవేణి తెలంగాణలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. రెండో అక్క దివ్య డీఎస్సీకి సిద్ధమవుతున్నారు. శరత్‌కుమార్ కృష్ణాజిల్లాలోని పాలిటెక్నిక్ చదువుతున్నాడు. తాజాగా ఈసెట్‌లో ఫలితాల్లో 164 మార్కులతో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బాలకృష్ణ.. 10వ ర్యాంకు

జలుమూరు మండలం గొటివాడ గ్రామానికి చెందిన గురువు బాలకృష్ణ ఈసెట్‌లోని గణితం విభాగంలో 10వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి గౌరమ్మ గృహిణి. బాలకృష్ణ 1వ తరగతి నుండి 5 వరకు గొటివాడ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. 6 నుంచి 10వ తరగతి వరకు కరవంజ మోడల్ స్కూల్‌లో చదివాడు. ఎచ్చెర్లలోని ప్రైవేటు కళాశాలలో డిప్లమో చేసిన బాలకృష్ణకు మంచి ర్యాంకు రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వ్యసనాలకు బానిసై.. స్మగ్లర్‌గా మారి

- గంజాయితో పోలీసులకు పట్టుబడిన బస్సు డ్రైవర్

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

8లో

దేవుడికీ దించండీ నారాయణా

- ఉద్దానం ప్రాంతంలో విరివిగా 'దేవుడి సంబరాలు'
- కళకళలాడుతున్న పల్లెలు
- వారంలో మూడు రోజులు సందడే సందడి



కంచిలి, మే 15 (ఆంధ్రజ్యోతి)

దేవుడి సంబరం.. ఉద్దానం ప్రాంతంలో వైశాఖ మాసంలో ఏ ఊరు వెళ్లినా... శుక్ర.. శని.. ఆదివారాల్లో ఏదో ఓ ఇంట్లో ఈ సందడి కనిపిస్తుంది. మూడు రోజుల పాటు ఈ సంబరాలు చేస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉద్దానంలో మాత్రం ప్రత్యేకంగా దేవుడి సంబరం పేరుతో ఈ నెలలో నిర్వహిస్తారు. ఇది వందల ఏళ్లుగా వస్తున్న ఆచారమని పెద్దలు చెబుతుంటారు. అత్యంత భక్తిశ్రద్ధలతో... నియమ నిష్ఠలతో వీటిని చేస్తారు. సాధారణంగా ఓ ఇంటి పేరు... ఓ గోత్రం పేరు ఉన్న వారు... ఓ కుటుంబం వారు లేదా రెండు, మూడు కుటుంబాల వారు కలసి సంబరాలు నిర్వహిస్తుంటారు. మహావిష్ణువు దశావతారాలలో ఓ అవతారానికి పూజలు చేయడమే దేవుడి సంబరం ప్రత్యేకత.

అలా మొదలవుతుంది..

దేవుడి సంబరాలు చేయాలనుకునే కుటుంబ సభ్యులు ముందుగా సింహాచలం వెళతారు. అక్కడ బైరోడు (భైరవుడు) స్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత సింహాచలం కొండపైకి వెళతారు. సింహాద్రి అప్పన్న దర్శనానంతరం సంబరాలకు కావలసిన కోలలు (దివిటీలు), నామం పళ్లు, అవతారాలు, తాళాలు (రామావతారం, కృష్ణావతారం, నారసింహ అవతారాలకు) సంబంధించిన సామాన్లు తీసుకుని వస్తారు. సాధారణంగా శుక్రవారం రాత్రి మొదలై... ఆదివారం మధ్యాహ్నంతో సంబరాలు పూర్తవుతాయి. 'దేవుడికీ దించండీ నారాయణా'.. వంటి పాటలను మూడు రోజుల పాటు పాడుతారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ బృందం (దాసులు) ఉంటారు. వీరి ఆధ్వర్యంలోనే మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ బృంద నాయకుడిని మూలదాసుడు అంటారు.

పూజను అమర్చే విధానం..

తూర్పు వైపుగా మూడు కుంభాలు (కలశాలు) పెడతారు. కలశాలకు పసుపు కొమ్ములను దారంతో కడతారు. ఆ నీటిలో తులసీదళాన్ని... పసుపు, కుంకుమలను వేసి ఈశాన్య భాగంలో వినాయకునికి కుంభం పెడతారు. దీనికి ఉత్తర వైపు అగ్ని కామెల్లిని అమరుస్తారు.

- **మొదటి రోజు శుక్రవారం:** సాయంత్రం దేవుడిని దించుతారు. అవతారంగా భావించే దేవుని చిత్రం ఉన్న వస్త్రం, తాళాలు, ఇతర వస్తువులు మేదర పెట్టెలో ఉంచి.. ఇంటిలోని ఎత్తయిన ప్రదేశంలో ఉంచుతారు. దీనిని కిందకు దించడాన్నే దేవుడిని దించడం అని పిలుస్తారు. మొదట వినాయకునికి, ఇష్టదేవతలు, గ్రామదేవతలకు పూజ చేస్తారు. అనంతరం పాలు కొలుస్తారు (ధాన్యం లేదా బియ్యం). అనంతరం బాలభోగం పేరుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆ తరువాత కాలభైరవుడిని మేల్కొలుపుతారు.



సాగరతీరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

- **రెండో రోజు శనివారం:** సంబరంలో కీలకమైన రోజు. ఉదయం మేల్కొలుపు, పాల్కొలుపు నిర్వహిస్తారు. అనంతరం బాలభోగం (నైవేద్యం) పెడతారు. ముందు రోజు కొలిచిన పాలబియ్యాన్ని మళ్లీ కొలుస్తారు. మొదటి రోజు కొలిచినప్పుడు కొంత బియ్యం పక్కన పెడతారు. మరుసటి రోజు కొలిచినప్పుడు కూడా మొదట అందులో వేసిన బియ్యమే లెక్క తగ్గకుండా ఉంటాయని భక్తుల విశ్వాసం. మధ్యాహ్నం వారి వారి స్థోమతను బట్టి అన్న సమారాధన చేస్తారు. అదే రోజు సాయంత్రం సముద్రానికి పాత పెట్టెను, అందులోని సామగ్రిని తీసుకెళతారు. సముద్రంలో వాటిని నిమజ్జనం చేస్తారు. భక్తులు సముద్ర స్నానాలు ఆచరిస్తారు. దేవునికి సంబంధించిన కొత్త వస్తువులను సాగర జలాలతో అభిషేకించి... వాటితో ఊరిలోకి బయలుదేరుతారు. ఆ రోజు ఉదయం నుంచి పేరంటాళ్లు ఉపవాసం ఉంటారు.

- **ఊరేగింపు:** సాయంత్రం సముద్రం నుంచి వచ్చిన తరువాత గ్రామంలోని ఏదైనా ఆలయంలో జేగంట మోగిన సమయంలో ఊరేగింపు మొదలు పెడతారు. స్వామి వారికి సంబంధించిన వస్తువులు పళ్లెంలో పెట్టి... అవతారాలను, కోలలను (దివిటీలు) పట్టుకొని ఊరేగిస్తారు. ఇది పూర్తయిన తరువాత ఆడపడుచులు నివ్వాళి పాటతో స్వామి వారిని ఇంటిలోకి ఆహ్వానిస్తారు. ఆ సమయంలో స్వామికి దిష్టి తీస్తారు.
- **తులసమ్మ భోగం:** తులసి కోట వద్ద అట్లు, పాలకాయలు, అన్న ప్రసాదం, కొత్త వస్త్రాలు పెడతారు.
- **వేంకటేశ్వరుని భోగం:** (కలశాలలో) కుంభాలలో నీటిని నింపి తులసీదళాలను ఉంచి.. వేంకటేశ్వర స్వామి ప్రతిరూపంగా భావిస్తారు. స్వామికి నైవేద్యంగా అన్న ప్రసాదం, అట్లు, పాలకాయలు వస్త్రాలు పెడతారు.

- **బైరోడు స్వామికి భోగం:** కాలభైరవుడికి నైవేద్యంగా అంతకుముందు కొలిచిన పాలు (బియ్యం)తో పాయసం తయారు చేసి పెడతారు. ఈ ప్రసాదం తయారు చేసే వ్యక్తులు తమ నోటికి వస్త్రాన్ని కట్టుకుంటారు. అనంతరం ఆసక్తికరమైన ఘట్టం మొదలవుతుంది. ప్రసాదాన్ని పందిరి మధ్యలో పెట్టి చిన్నపాటి పోటీని నడుపుతారు. స్వామి వారి ప్రసాదాన్ని ఓ మట్టి కుండలో ఉంచి.. పందిరి మధ్యలో ఓ ముగ్గు వేసి... దానిపై కుండను ఉంచుతారు. దాసులు, భక్తులు, సంబరం నిర్వాహకులు ఆ కుండ చుట్టూ తిరుగుతూ... పాటలు పాడుతారు. ఆ సమయంలో సంబరం నిర్వాహకులకు వరుసైన వారు అంటే మేనల్లుళ్లు.. మేనమామలు...బావలు ఆ కుండను దొంగిలించడం...వారిని పట్టుకోవడం ఆచారం. ఈ ఘట్టం అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. దొంగిలించిన వ్యక్తి ఆ ప్రసాదాన్ని అందరికీ పంచి పెడతారు.

కోలలు పలికించడం..

దేవుని సంబరంలో మరో ఘట్టం కోలలు పలికించడం. వీటిని వెలిగించేందుకు సాధారణంగా నెయ్యి గానీ, ఆముదంగానీ వాడతారు. కోలలు నేతితో నింపి మండుతున్నప్పుడు దీన్ని తలకిందులుగా చేస్తారు. ఆ సమయంలో సంబరం నిర్వహించే కుటుంబాల వారు ఏ అవతారాన్ని పూజిస్తే.. ఆ అవతారం పేరు పెట్టి దాసులు పిలుస్తారు. అప్పుడు కోలల నుంచి నిప్పులు రాలుతాయి. దీన్ని దేవుడు పలకడం అని భక్తుల విశ్వాసం. వీటిని పూవులుగా పిలుస్తారు.



సాగరంలో నిమజ్జనానికి సిద్ధం చేసిన పాత సామగ్రి



హారతులతో స్వామికి స్వాగతం పలుకుతున్న మహిళలు

కొండపైకి ఎక్కించడం..

దేవుడి సంబరంలో మూడో రోజైన ఆదివారం ఉదయం మళ్లీ స్వామికి మేల్కొలిపి... పూజలు చేస్తారు. కొత్త మేదర బుట్టను తీసుకొచ్చి... మూడు రోజుల పాటు స్వామి పూజలకు ఉపయోగించిన సామగ్రి, తాళాలు... ఇతర వస్తువులను ఆ బుట్టలో పెట్టి మూతవేస్తారు. భక్తులు తాము దేవుడికి సమర్పించాలనుకున్న కానుకలు ఆ బుట్టలో వేస్తారు. ఇది పూర్తయిన తరువాత ఆ కుటుంబ పెద్ద తలపై దానిని పెట్టుకొని ఇంటి లోపల ఎత్తుగా ఉన్న ప్రదేశంలో ఆ బుట్టను జాగ్రత్తగా మళ్లీ అమరుస్తారు. దీంతో మూడు రోజుల సంబరాలు పూర్తయినట్టుగా భావిస్తారు. దేవుడిని కొండపైకి ఎక్కించే సందర్భంలో అరటి గెలల నుంచి పండ్లను వేరుచేసి.. పై నుంచి కిందకు విసురుతారు. ఇలా ఎవరికి అత్యధికంగా దొరికితే వారిని దేవుడు కరుణించినట్టుగా భావిస్తారు. దేవుడిని కిందకు దించింది మొదలు... మళ్లీ కొండపైకి ఎక్కించే వరకూ ప్రతిఘట్టమూ ఉత్సాహంగా.. ఆసక్తికరంగా సాగుతుంది. అందుకే ఎవరి ఇళ్లలో సంబరం చేసినా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తిలకించడానికి వెళుతుంటారు.



మందస: సత్యసాయి ప్రేమవాహినీ యాత్రలో పాల్గొన్న భక్తులు

సత్యసాయి ప్రేమ వాహినీ రథయాత్ర

మందస/పాతపట్నం/నందిగాం, మే 15 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మందసలో గురువారం మధ్యాహ్నం సత్యసాయి ప్రేమవాహినీ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పరివర్తన చెందితేనే సమాజం మారుతుందన్నారు. తద్వారా దేశంలో శాంతి, సామరస్యం నెలకొంటాయన్నారు. సేవాగుణాన్ని పెంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ బైరాగి, మాజీ సర్పంచ్ డి.తిరుపతి, త్రివేణి, మందస కన్వీనర్ ఈశ్వరరావు, యూత్ కోఆర్డినేటర్ శివ తదితరులు పాల్గొన్నారు. నందిగాం దిమ్మిడిజోలలోని షిర్డీసాయి ధ్యానమందిరంలో గురువారం సామూహిక సాయివ్రతాలు నిర్వహించారు. ధర్మకర్త సలాన వెంకట్రావు ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. పాతపట్నంలో జరిగిన యాత్రలో స్థానిక సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఈ గాలీ... ఈ నేల!



- నాగావళి వంతెనపై సేదదీరుతున్న జనం

అరసవల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పేదలు, సామాన్యులు, ఇరుకు ఇళ్లలో గాలి ఆడక.. నిద్రకోసం రాత్రి వేళల్లో శ్రీకాకుళం నగరంలోని నాగావళి నదిపై ఉన్న పాత వంతెనను ఆశ్రయిస్తున్నారు. ఆటో డ్రైవర్లు... రిక్షా కార్మికులు, పేదలు భోజనాల అనంతరం చల్లదనం కోసం వంతెనపైకి చేరుకుంటున్నారు. ఇరువైపులా గల ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారు. ఇక యువకులు, నగరంలోని వివిధ ప్రాంతానికి చెందిన ప్రజలు సాయంత్రం నుంచి రాత్రి వరకు చల్లగాలి కోసం వంతెనపై సరదాగా గడుపుతున్నారు.







పూజలందుకుంటున్న అమ్మవారు..

భక్తిశ్రద్ధలతో వృషభ సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వృషభ సంక్రమణం పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సిందూర మర్దన, అభిషేకాలు, కుంకు మార్చనలు చేశారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ప్రత్యేక హారతులతో పాటు హోమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణలో రెండువేల మందికి అన్న ప్రసాదం పంచిపెట్టారు. ఆలయ ప్రాంగణంలో సరస్వతి సంగీ త విద్యానిలయం చిన్నారుల గాత్ర కచేరి ఆకట్టుకుంది. గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ, మండపల్లి గారపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయాల్లోనూ సంక్రమణం పూజలు చేశారు.

ఘనంగా సాయి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): బలగలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకడ హారతి, క్షీరాభిషేకం చేశారు. బాబాకు పూలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు షిరిడి సాయిబాబా చరిత్రను పారాయణం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకున్నారు.



మూడు విడతలు.. ఒకేసారి

(ఐదో పేజీ తరువాయి)

డబ్బులు జమకాక నిరాశ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలిట్‌బ్యూరో సమావేశంలో దీనిపై చర్చించారు. ఇకపై గ్యాస్ వినియోగదారుల జాబితా ప్రకారం ముందుగానే ఏడాదికి సంబంధించి మూడు సిలిండర్ల డబ్బులను ఒకేసారి రూ.2,488 చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ నుంచి జూలై, ఆగస్టు నుంచి నవంబరు, డిసెంబరు నుంచి మార్చి వరకు మూడు విడతలుగా విభజించి ఉచితంగా సిలిండర్లు ఇవ్వనున్నారు. రాయితీ డబ్బులు ముందుగానే జమచేయ నుండడంతో అర్హులైన లబ్ధిదారులందరికీ మేలు జరగనుంది.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు

అరసవల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను, లేబర్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని డైమండ్ పార్కు వద్ద సమ్మె కరపత్రాలను, పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసూలు చేసిన సెస్ రాష్ట్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.4300 కోట్లు ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాపై ఒక్క రూపాయి భారం పడకుండా క్లెయిమ్‌లు చెల్లించవచ్చని అన్నారు. కార్మిక వర్గాన్ని నమ్మించి మోసం చేయడం నాయకులకు పరిపాటి అయిపోయిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కోశాధికారి అనుపోజు కామేశ్వరరావు, నాయకులు కె.రామారావు, బైరి చిన్నారావు, లక్ష్మణరావు, మెండ గణేష్, కె.సింహాచలం, మల్లేష్, గోపి, కె.రమణ, టి.మల్లేశ్వరరావు, ఎ.శంకరరావు, తవుడు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



అంగీకార పత్రాలను అందజేస్తున్న నవ దంపతులు శ్రీనివాసనాయుడు, ప్రియాంక, వారి బంధువులు, స్నేహితులు

వివాహ వేదిక సాక్షిగా..

- అవయవ దానానికి నవదంపతుల అంగీకారం
- వీరి బాటలో మరో 60 మంది ముందుకు...

ఎచ్చెర్ల, మే 15(ఆంధ్రజ్యోతి): తాళికట్టు శుభవేళ.. ఆ నవదంపతులు సమాజంలో నలుగురికీ ఆదర్శంగా ఉండేలా ఓ నిర్ణయం తీసుకున్నారు. తమ మరణానంతరం అవయవ దానానికి అంగీకరిస్తున్నట్టు వివాహ వేదిక సాక్షిగా ప్రకటించారు. అంతేకాదు... మరికొంత మంది ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనేలా స్ఫూర్తినింపారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా పత్తికాయవలస గ్రామానికి చెందిన బాలి శ్రీనివాసులు నాయుడుకు, శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన ప్రియాంకతో ఎచ్చెర్ల మండలం మెట్టపేటకు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం వివాహం జరిగింది. ఈ పెళ్లి వేదిక నుంచే నూతన దంపతులతో పాటు వారి స్నేహితులు, బంధువులు 60 మంది ముందుకువచ్చి అవయవ దానానికి అంగీకరించారు. ఈమేరకు విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన మానవీయతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బీవీ గోవింద రాజులుకు అంగీకార పత్రాలను అందించారు.

నేడు ప్రజా దర్బార్

ఆమదాలవలస, మే 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గం పార్టీ కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ హాజరయ్యే ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందించాలని కోరారు.

ఉత్తమ నాటికగా 'ఇంద్రప్రస్థం'

కవిటి, మే 15(ఆంధ్రజ్యోతి): భైరిపురంలో ఆ గ్రామ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన అంతర్ రాష్ట్ర ఆహ్వానిత నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' నాటిక ప్రథమ స్థానంలో నిలిచింది. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన చీకటిపువ్వు నాటికి ద్వితీయ స్థానం, గుంటూరుకు చెందిన అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'నాన్నా.. నేనొచ్చేస్తా' నాటిక తృతీయ స్థానంలో నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొని నిర్వాహకులతో కలిసి బహుమతి ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీ సెక్షన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈ నెల 16న పీఎన్ కాలనీ, కిమ్స్ రోడ్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

● ఇచ్ఛాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మెంటినెన్స్ పనులు సందర్భంగా మండలంలో గల పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ యఘ్నేశ్వరరావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తేలుకుంచి, హరిపురం, మశాఖపురం, జగన్నాథపురం, బిర్లంగి, తోటూరు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

విచారణ మళ్లీ వాయిదా

సరుబుజ్జిలి, మే 15(ఆంధ్రజ్యోతి): తెలికిపెంట పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై గురువారం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశం మళ్లీ వాయిదాపడింది. వివరాల్లోకి వెళితే పంచాయతీలో సుమారు రూ.2.70 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామానికి చెందిన బెవర మల్లేశ్వరరావు గతంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో విచారణ సమయంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో విచారణ జరగకుండా అధికారులు వెనుదిరిగారు. మళ్లీ ఇటీవల గ్రీవెన్స్‌కు రెండోసారి ఫిర్యాదు చేయగా.. ఈసారి కూడా విచారణ పూర్తిస్థాయిలో జరగలేదు. ఉన్నతాధికారులు నుంచి వచ్చిన అంశాల మేరకు మాత్రమే విచారణ చేపట్టామని ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు తెలిపారు. నిధులు దుర్వినియోగంపై ఎటువంటి విచారణ చేయలేదని చెప్పినట్టు తెలుస్తుంది. ఈ విచారణకు ఫిర్యాదుదారు హాజరవ్వగా, సర్పంచ్ డుమ్మా కొట్టారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కంచమ్మతల్లి సంబరానికి ఆహ్వానం

కంచిలి, మే 15(ఆంధ్రజ్యోతి): కంచిలి ప్రజల ఆరాధ్యదేవత కంచమ్మతల్లి సంబరాలు జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సంబరాలకు హాజరు కావాలని జనసేన పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ నాగేంద్రబాబును, భీమిలి పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సందీప్ పంచకర్లను విశాఖలో గురువారం కలిసి ఆహ్వానించినట్టు ఆ పార్టీ నాయకులు లింగబారీ క్రాంతికుమార్, మజ్జి నేతాజి తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకురాలి తొలగింపు

పొందూరు, మే 15(ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువ పత్రంతో ఉద్యోగంలో చేరిన బాపిరాజుపేట అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు బి.సుగుణను విధుల నుంచి తొలగిస్తూ ఆమదాలవలస సీడీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి తప్పుడు ధ్రువ పత్రంతో ఉద్యోగం చేస్తున్నట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు అది తప్పుడు ధ్రువపత్రంగా నిర్ధారించి అంగన్‌వాడీ సెలక్షన్ కమిటీకి పింపించారు. కమిటీ పరిశీలన అనంతరం అంగన్‌వాడీ సహాయకురాలు సుగుణను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆమదాలవలసవలస సీడీపీవో అమ్మాజీ చర్యలు చేపట్టారు.

దైవ దర్శనానికి వెళ్తూ వృద్ధురాలి మృతి


లక్ష్మమ్మ మృతదేహం

ఇచ్ఛాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): టూరిస్ట్ బస్సులో తీర్థయాత్రకు వెళ్తూ లక్ష్మమ్మ (60) అస్వస్థకు గురై మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పెద్ద పంజాని మండలం గోనుమాకులపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 46 మందితో కలిసి లక్ష్మమ్మ తీర్థయాత్రలకు ఈ నెల 8న బయలుదేరింది. కాశీ, అయోధ్య ఇతర పుణ్యక్షేత్రాలు దర్శంచుకొని తిరిగి బస్సులో వస్తుండగా.. అస్వస్తతకు గురైంది. వెంటనే ఇచ్ఛాపురం సమీపంలో గల ప్రభుత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలి చెల్లెలు తోట గంగులమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్ హెచ్‌సీ బి.జగదీశ్వరరావు కేసు నమోదు చేస్తున్నారు.

రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


సదస్సులో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే అశోక్

కవిటి, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటిలో సీడాప్, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్తంగా రైతులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ.. రైతులు ఏదో ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం ఎస్.రమణమూర్తి, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల ఉద్యానవన, వ్యవసాయశాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయం

కవిటి, మే 15(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటిలోని కొబ్బరి ఉత్పత్తిదారుల సమాఖ్య భవనంలో గురువారం ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం మెరుగుపడుతుందన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అన్నారు. అందుకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో గోవింద్, ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్ర ప్రకాష్, నేతలు బి.చిన్నబాబు, బి.రమేష్, భీమారావు రౌళో, పి.కృష్ణారావు, ఎ.మధు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, మే 15(ఆంధ్రజ్యోతి): శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండ శివచరణ్ రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విజయనగరం జిల్లా కొండవెలుగువాడలో ఇటీవల నిర్వహించిన అండర్-23, 67 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17,18 తేదీల్లో చిత్తూరులో జరగనున్న చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శివచరణ్ పాల్గొంటున్నాడు. శివచరణ్ ప్రతిభ పట్ల కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, పీడీ టి.బాలాజీ, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కంచిలి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గురుకులాల నిర్వహణ గత ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందని, చివరికి విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్స్ చార్జీలను రద్దు చేసిందన్నారు. గురుకులాల్లో పారా మెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, జిల్లాకు రెండేసి బాలుర, బాలికల డిగ్రీ కళాశాలలు స్థాపించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుర్గాశి గణేష్, బి.ప్రభాకర్, సీహెచ్ రామారావు, మిస్కా కృష్ణయ్య, చింత ప్రకాశరావు, లోకేశ్వరరావు, బడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేపట్టిన కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు శ్యామలరావు, సతీష్ తెలిపారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం విధులు బహిష్కరిస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల కార్యాలయ సిబ్బంది, నాన్ ఆపరేటర్స్, పంప్ ఆపరేటర్స్ పూర్తిస్థాయి సమ్మెకు సన్నద్ధమయ్యారని తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు, టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలను ఉధృతం చేస్తామని, తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కల్యాణి అప్పలరాజు, గురుమూర్తి, మజ్జి శ్రీను, సుగాలి, శంకరరావు, రామారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

21న ఆలయ భూముల కౌలుకు వేలం

బూర్జ, మే 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బూర్జ గ్రామంలో వెలసియున్న రాధాకాంత స్వామివారి భూముల కౌలుకు సంబంధించి ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి తమ్మినేని రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూర్జతోపాటు మదనాపురం గ్రామ పరిధిలో ఉన్న భూములకు మూడేళ్ల కాలపరమితికి కౌలు హక్కు పొందేందుకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. మదనాపురం గ్రామం వద్ద గల శివకేశవ స్వామి క్షేత్రం ప్రాంగణంలో వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆసక్తి గలవారు రూ.2000 ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన సదస్సు

కంచిలి, మే 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు ముందు నవధాన్యాల సాగు వలన నేలసారవంతమవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. బూరగాంలో, కత్తివరం గ్రామాల్లో గురువారం పీఎండీఎస్, ఖరీఫ్ సాగు ప్రణాళికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు పండి రామప్రసాద్, బావన కృష్ణమూర్తి, కప్పగోపీనాథ్, మడ్డు వెంకటేశ్వరరావులను సత్కరించారు. టీడీపీ నాయకులు బొడ్డు అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి కామరాజు, డిల్లీరావు, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

గణితావధానికి అభినందన

కంచిలి, మే 15(ఆంధ్రజ్యోతి): చిత్రాయిపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గణితావధాని మడ్డు తిరుపతిరావు గణితంలో చేసిన ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంతో గ్రామస్థులు గురువారం సత్కరించారు. తిరుపతిరావు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, డొక్కరి బ్రహానందం, కోట వాసు, కర్రి బాలరాజు, రాజేష్, బి.బాలరాజు, రామచంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులతో పత్రికా పఠనం

గార, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గురు వారం ఉదయం విద్యార్థులకు పత్రి కాపఠనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు.

చంద్రబాబు, లోకేష్‌ను కలిసిన చౌదరి బాబ్జీ కుటుంబం


ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ) తన కుటుంబ సభ్యులతో కలిసి అమరావతిలో గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌గా చౌదరి బాబ్జీ తనయుడు అవినాష్‌ను నియమించడంతో ఆయన కుటుంబ సభ్యులతో సీఎం, మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నిమితులైన చౌదరి అవినాష్, బుడగట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, పార్టీ నేతలు గాడు రామారావు, చీకటి శ్రీరాములు ఉన్నారు.

రైల్వే అండర్ పాసేజ్‌లో వర్షపు నీరు


బొడ్డేపల్లి-బెలమాం రైల్వే అండర్ పాసేజ్‌లో చేరిన నీరు

పొందూర, మే 15(ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్‌ల వద్ద రాకపోకల కష్టాలు తీర్చాలని ఆ శాఖ ఏర్పాటు చేసి అండర్ పాసేజ్‌లు మరింత ఇబ్బందిగా మారుతున్నాయి. జిల్లాలో చాలా చోట్ల ఏర్పాటు చేసిన అండర్ పాసేజ్‌ల్లో చిన్నపాటి వర్షం పడినా నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ సమస్య పరిష్కరించాల్సిన రైల్వే అధికారులు చేతులెత్తేస్తుండడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం బొడ్డేపల్లి, బెలమాం గ్రామాల మధ్య ఉన్న అండర్ రైల్వే పాసేజ్ గత రెండు రోజులుగా కురిసిన చిన్నపాటి వర్షానికి 10 అడుగుల మేర నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు

హైవే అధికారుల ఆంక్షల పేరుతో వినియోగానికి దూరం ● ఇదీ టెక్కలిలో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం పరిస్థితి



టెక్కలిలో నిర్మాణం పూర్తయిన ఎంఎల్ఎస్ గోదాం

టెక్కలి, మే 15(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం నిర్మాణం పూర్తయినా ప్రారంభించడం అధికారులు మరిచిపోయారు. హైవే అధికారుల ఆంక్షల పేరుతో వినియోగంలోకి తీసుకురాని పరిస్థితి నెలకొంది. మొత్తంగా అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల రూ.30 లక్షల ప్రజాధనం వృథా అయ్యిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరేళ్లగా గోదాము ప్రారంభానికి ఎదురుచూస్తోంది.

టెక్కలిలో ఆరేళ్ల కిందట జాతీయరహదారికి సమీపంలో లచ్చన్నపేట మలుపు వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో వెయ్యిటన్నుల నిల్వ సామర్థ్యం గల ఎంఎల్ఎస్ గోదాం పాయింట్, కార్యాలయం సుమారు రూ.30లక్షల అంచనా వ్యయంతో నిర్మించారు. అయితే గోదాం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గోదాంకు ఉన్న కిటికీలు కొన్ని చోరీ కాగా, మరికొన్ని కిటికీల అద్దాలను కొందరు ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం జూనియర్ కళాశాల మైదానం దగ్గరిలో శిథిలావస్థ భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఎంఎల్ఎస్ గోదాం నిర్మాణం జరిగిన తరువాత జాతీయరహదారి యంత్రాంగం రాకపోకలకు అనుమతి ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ముందుచూపు లేకుండా గోదాం నిర్మించడం, ఇప్పుడు హైవే అధికారులు అడ్డుకుంటున్నారని పేర్కొనడంపై విమర్శలొ స్తున్నాయి. అక్కడ రెవెన్యూ అధికారులు ఎందుకు నిర్మించారు, ఎందుకు ప్రారంభానికి నోచుకోలేదోనన్న అంశంపై కనీసం దృష్టి సారించడం లేదని సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం గోదాం ప్రాంతంలో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కార్యాలయపు గది అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. తక్షణమే రెవెన్యూ అధికారులు హైవే యంత్రాంగంతో మాట్లాడి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. కాగా హైవే అధికారుల ఆంక్షల వల్ల ఎంఎల్ఎస్ గోదాం ప్రారంభానికి నోచుకోలేదని తనకు తెలిసిందని డీటీ అనీల్‌కుమార్ తెలిపారు.

వ్యసనాలకు బానిసై.. స్మగ్లర్‌గా మారి

● 14 కిలోల గంజాయితో పోలీసులకు పట్టుబడిన బస్సు డ్రైవర్

పలాస, మే15(ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆదాయం సరిపడకపోవడంతో స్మగ్లర్‌గా మారాడు. ఈ మేరకు గుణుపూర్-బరంపురం రూట్‌లో ఓ బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న సుజీత్ సూర్జియా మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో కుటుంబాన్ని పోషణకు ఆదాయం సరిపడకపోవడంతో గంజాయి స్మగ్లరుగా అవతారంఎత్తి పోలీసులకు పట్టుబడ్డాడు.గురువారం కాశీబుగ్గ డీఎస్పీ బి.వెంకటఅప్పారావు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గంజాయి స్మగ్లర్‌తో పాటు గంజాయిని ప్రవేశపెట్టారు. డీఎస్పీ కథనం మేరకు.. ఒడిశాలోనిగుణుపూర్‌కు చెందిన సూర్జియకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. డ్రైవింగ్ చేస్తూ పొట్టపోషించుకుంటున్న క్రమంలో చెడువ్యసనాలకు బానిసై డబ్బంతా మద్యానికి ఖర్చుచేసేవాడు. ఆయన ఆదాయం సరిపడకపోవడంతో గంజాయి రవాణాద్వారా అదనంగా ఆదాయం సంపాదించవచ్చని భావించాడు. ఈక్రమంలో పర్లాకిమిడికి చెందిన పుస్కో పొరిచాతో పరిచయమయ్యాడు. అయన గంజాయి స్మగ్లింగ్ చేసి ఆదాయం సంపాదిస్తున్నాడు.ఇతర రాష్ట్రాలకు కూడా సరకు పంపిస్తున్నాడు. ఆయన ఈవిషయాన్ని సూర్జియకు చెప్పగా గంజాయి స్మగ్లింగ్‌కు అంగీకరించాడు.ఈ క్రమంలో 14 కిలోల గంజాయి ప్యాకెట్లను మహారాష్ట్రలోని పూణేలోఉన్న జ్యోతి చవాన్‌కు అప్పగించాలని, ఇందుకు రూ.20వేలు ఇస్తామని పొరిచా తెలియజేశాడు. దీంతో గంజాయి బ్యాగును పలాస రైల్వే స్టేషన్‌కు తరలించి రైలుమార్గం ద్వారా పూనే వెళ్లడానికి బుధవారంరాత్రి సిద్ధమయ్యాడు. సాధారణ తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఆయన బృందం బ్యాగులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో సూర్జియ ఉండడంతో ఆయన్ను ప్రశ్నించగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో సూర్జియను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు. మిగిలిన నిందితులు పుస్కో పొరిచా, జ్యోతి చవాన్‌ల కోసం గాలిస్తున్నారు.

లారీ కింద పడి క్లీనర్ మృతి

పలాస, మే 15(ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ పరిధి లోగల మొగిలిపాడు సమీపంలో ఉన్న సూర్యరోడ్ వేస్ వద్ద బుధవారం రాత్రి లారీ కింద పడి క్లీనర్ బాకాడుయాదవ్(25) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సుడియా నారాయణరావుకు చెందిన ట్రాన్స్‌పోర్టు కంపెనీలో జీడి పప్పును తరలించడానికి ఛత్తీస్‌ఘడ్ నుంచి డ్రైవరుచిరంజీలాల్‌నిషాద్, క్లీనర్ బాకాడ్ యదవ్‌లారీతో ఈనెల 13న వచ్చారు. 14వ తేదీ రాత్రి సరకులు లారీలో ఎక్కిస్తున్న క్రమంలో క్లీనర్‌కు నిద్రరావడంతో లారీ వెనుకభాగంలో పడుకున్నాడు. సరకు లోడింగ్‌చేసిన తర్వాత లారీని వెనుక్కు మళ్లించిన క్రమంలో నిద్రిస్తున్న విషయాన్ని తెలియకపోవడంతో లారీ ఆయనపైనుంచి వెళ్లిపోవడంతో క్లీనర్ అక్కడకక్కడే మృతి చెందాడు. అదేరోజు రాత్రి ట్రాన్స్‌పోర్టు యజమాని నారాయణరావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించి ఏఎస్ఐ ఆనందరావు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రాత్రి గొడవ.. ఉదయం హత్య

● మద్యం మత్తులో స్నేహితుల మధ్య వివాదం

● గడ్డకట్టి ఉన్న సిమెంట్ బస్తాతో మోది ఒకరి హత్య

విజయవాడ (గుణదల), మే 15 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుల మధ్య చోటుచేసుకున్న ఓ చిన్న వివాదం.. చివరికి పెద్దదై హత్యకు దారితీసింది. గుణదల, విజయనగర్ కాలనీలో గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.లక్ష్మణ్ (36)కు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అదే ప్రాంతానికి చెందిన మల్లేశ్.. లక్ష్మణ్‌కు మంచి స్నేహితుడు. ఇద్దరూ కొంతకాలం హైదరాబాద్‌లో సెంట్రింగ్ పనిచేశారు. రెండు నెలల క్రితమే లక్ష్మణ్.. విజయనగర్ కాలనీకి వచ్చి, రూమ్ అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. స్నేహితుడు మల్లేశ్ కూడా మూడు రోజుల క్రితమే గుణదల చేరుకుని లక్ష్మణ్‌తో కలిసి సెంట్రింగ్ పనికి వెళ్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరూ మద్యం సేవించి రూమ్‌కు చేరుకున్నారు. మత్తులో ఇద్దరూ గొడవ పడుతుండటంతో స్థానికులు సర్దిచెప్పారు. దీంతో ఎవరికి వారు నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో లక్ష్మణ్ నిద్రమత్తులో ఉండగా, మల్లేశ్ గడ్డకట్టి ఉన్న సిమెంట్ బస్తాను లక్ష్మణ్ తలపై మోదాడు. దీంతో లక్ష్మణ్ అక్కడికక్కడే చనిపోవడంతో మల్లేశ్ పరారయ్యాడు. తెల్లవారాక స్థానికులు వెళ్లి చూడగా, లక్ష్మణ్ రక్తపు మడుగులో పడి కనిపించాడు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాశ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పరారీలో ఉన్న మల్లేశ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి ఒకరికి గాయాలు

పలాస, మే15(ఆంధ్రజ్యోతి):పలాస రైల్వే స్టేషన్‌కు సమీపంలో కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద గురువారం రైలుకింద పడి రంజిత్‌కు తీవ్ర గాయలకు గురయ్యాడు. ఆయన కుడి కాలు పూర్తిగా తెగిపోయినట్లు రైల్వే పోలీసులు గుర్తించి అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. రంజిత్ కోల్‌కత్తాకు చెందినవానిగా పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ఇదే ప్రాంతంలో సంచరిస్తున్నానని, ఈ క్రమంలో రైలుఢీకొన్నట్లు బాధితుడు చెబుతున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగరతీరానికి వెళ్లే వాహనాల తనిఖీ

పోలాకి, మే15(ఆంధ్రజ్యోతి): పోలాకి నుంచి గుప్పెడుపేట సాగరతీరం వెళ్లే వాహనాలను పోలీసులు గురువారం తనిఖీచేశారు. ఈసందర్భంగా ఎస్ఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా సైన్యం చేపడుతున్న దాడుల నేపథ్యంలో ఉగ్రవాదులు తీరం వెంబడి చొరబడే అవకాశమున్న దృష్ట్యా వాహనాలు తనిఖీచేస్తున్నామని చెప్పారు.

మృతుడి బంధువుల నిరసన

● వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆరోపణ

శ్రీకాకుళం క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం కొంద్రు త్రినాథరావు(32) మృతి చెందగా గురువారం కూడా బంధువులు ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే త్రినాథరావు మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. గురువారం పెద్దఎత్తున గ్రామస్థులతో కలిసి ఆసుపత్రికి చేరుకుని నిరసన తెలిపారు. త్రినాథరావు చనిపోయి రెండు రోజులైనా ట్రీట్‌మెంట్ చేశారని, సుమారు రూ.నాలుగు లక్షలు వైద్యం కోసం వసూలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారించినా.. వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే ఎప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం,వైద్యులు స్పందించకపోవడంతో మధ్యాహ్నం ఎస్పీ మహేశ్వరరెడ్డి వద్దకు వెళ్లి ఫిర్యాదుచేశారు. విచారణచేస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో త్రినాథరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన త్రినాథరావు బంధువులు

మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



కాశీబుగ్గ: కుట్టుమిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, మే 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.గురువారం పలాస- కాశీబుగ్గ మునిసిపాలిటీలోని మూడోవార్డు పరిధి నెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు,కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కాశీబుగ్గలో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో కమిషనర్ రామారావు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, కౌన్సిలర్ ఆనంద్, బడ్డ నాగరాజు, నవీన్, రాంబాబు, రామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

●వజ్రపుకొత్తూరు, మే 15(ఆంధ్రజ్యోతి):వజ్రపుకొత్తూరులో కుట్టుమిషన్ శిక్షణకేంద్రాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, తహసీల్దార్ సీతారామయ్య, డీటీ మురళీకృష్ణ, నాయకులు సూరాడ మోహనరావు, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

●పలాస, మే 15(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి ఉద్దానం రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీరందించేందుకు అవరోధాలు అధిగమించేందుకు చర్యలు తీసుకున్న కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్‌కు పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కుఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావుతో పాటు టీడీపీనాయకులతో కలిశారు. ఆఫ్‌షోర్ నీరు వచ్చేవరకూ ఉద్దానం జలాలు సరఫరాకు చర్యలు తీసుకున్న కలెక్టర్‌కు ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం: సీఈవో

ఎల్.ఎన్.పేట, మే 15(ఆంధ్రజ్యోతి) దబ్బపాడు గ్రామస్థుల తాగునీటి సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరిస్తామని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు తెలిపారు. వంశధారనది చెంతనేఉన్నా తాగునీటికి ఇబ్బందులుపడుతుండడంతో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి వచ్చారు. ఈసందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీనర్సుపేట మెగారక్షితనీటి పథకంద్వారా గతంలో గ్రామానికి తాగునీరు వచ్చేదని, వేసవి ప్రారంభమైన తర్వాత మెగా రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. కుళాయిల ద్వారా నీరురాకపోవడంతో వంశధారనదిలో చెలమల్లో నీటిని సేకరిస్తున్నామని చెప్పారు. దీంతో గ్రామానికి తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సీఈవో కోరారు. కార్య క్రమంలో ఎంపీడీవో పి. శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, జేఈ రాజేశ్వరి, సర్పంచ్ ఎం.మోహిని పాల్గొన్నారు.

నేడు జంట పట్టణాలకు దివ్యరథం రాక

పలాస, మే15(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు సత్యసాయి శతవర్ష జయంత్యుత్సవాల్లో భాగంగా దేశం నలుమూలల సంచరిస్తున్న సత్యసాయి ప్రేమప్రవాహిని దివ్యరథం శుక్రవారం రానుందని మందిర కార్యదర్శి తిరుమలరావు, ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, జేసీహెచ్ శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి శోభాయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసన్నపేట, మే 15(ఆంధ్రజ్యోతి): ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోమర్తి, యారబాడు, వీఎన్‌పురం, లుకలాం, ఉర్లాం, నడగాం, చోడవరం, సుందరాపురం, చెన్నాపురం, తోటాడ తదితర గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

●హరిపురం, మే15(ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో అంబుగాంఫీడర్‌లో కొత్తస్తంభాలు ఏర్పాటు, యూజీ కేబుల్ నిర్వహణ వల్ల మఖరజోల, అంబుగాం, కుంటికోట, పిడిమందస పంచాయతీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎల్.యోగి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగుగంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేడు కుట్టుశిక్షణ ప్రారంభం

పోలాకి, మే 15(ఆంధ్రజ్యోతి): దండులక్ష్మీపురం తుపాన్ షెల్టర్ భవనంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బగ్గరమణమూర్తి ప్రారంభిస్తారని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, సూపరింటెండెంట్ బలగప్రకాష్ తెలిపారు. రెండు విడతలుగా 120 మంది మహిళలు ఉచితంగా కుట్టుశిక్షణ పొందేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిగా షాలిని

నరసన్నపేట, మే 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఎం.షాలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్.అరవింద్ ఉన్నత చదువుల కోసం వెళ్లారు. పీహెచ్‌సీ సిబ్బంది షాలిని అభినందించారు

ప్రత్యేక అవసరాల పిల్లలకు రాయితీలు

జలుమూరు (సారవకోట) మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని సారవకోట ఎంఈవో ఎంవీ రమణ ఒకప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష నేతృత్వంలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులు 18 ఏళ్లలోపు వయసు గల పిల్లలను గ్రామాల్లో సర్వే నిర్వహించి గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఈనెల 13న చేపట్టిన సర్వే వచ్చేనెల తొమ్మిదో తేదీ వరకూ ఐఈఆర్‌పీలు నిర్వహిస్తారని, వారికి దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు సహకరించి, పిల్లలు వివరాలు అందజేసి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు గతఏడాది ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్టు అలవెన్స్ మూడువేలు రూపాయలు చొప్పున అందించినట్లు తెలిపారు. బాలికలకు ప్రత్యేకంగా స్టయిఫండ్ రెండువేలు అందించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఆవు మృతి

టెక్కలి, మే15(ఆంధ్రజ్యోతి): నౌపడా-గుణుపూర్ బ్రాడ్‌గేజ్ మార్గంలో గురువారం ఉదయం పూరి-గుణుపూర్ రైలుఢీకొని ఆవు అక్కడికక్కడే మృతిచెందింది.అయితే ఆవు యజమాని అక్కడకు చేరలేదు. దీంతో రైల్వే సిబ్బంది ఆవును పక్కకు తొలగించారు.

గజవాహనంపై శ్రీనివాసుడు

నరసన్నపేట, మే15(ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వారంరోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసునుని గజవాహనంపై తిరువీథి నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ప్రత్యేక పూజలు, అభిషేకాలను సత్యవరం రుత్వికులు, ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో చేపట్టారు. శుక్రవారం సూర్యప్రభ వాహనంతో తిరువీథి నిర్వహించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసునికి, పార్వతీ పరమేశ్వర్లకు కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు మావుడూరి జగదీష్‌బాబు తెలిపారు.

ఘనంగా వృషభ సంక్రమణ పూజలు

పలాసరూరల్,మే15(ఆంధ్రజ్యోతి): పలాసలోని రామాలయంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో గురువారం వృషభ సంక్రమణం పురస్కరించుకుని ప్రత్యేక హోమం, పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు పండా, రాఘవ పండా, కామేశ్వరపండా, కైలాస్‌దాస్, అర్చకులు దాస్,బాలకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి రైల్వేగేట్ మూత

నరసన్నపేట, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లవానిపేట రైల్వేగేట్ వద్ద నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం నుంచి ఈనెల 20 వరకు రైల్వే గేట్ మూసివేస్తున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్ -ఉర్లాం రైల్వేస్టేషన్ల మధ్యలోగల గేట్ నెంబరు-422 వద్ద క్రాసింగ్ పనుల దృష్ట్యా శని,ఆదివారాలు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు, 19, 20 తేదీల్లో పూర్తిస్థాయిలో గేట్ మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



నరసన్నపేట: మడపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగు విధానం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి బి. సీతారామయ్య తెలిపారు. గురువారం మడపాంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి చేయవచ్చనన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, డి.లీలావతి, సింహాద్రి, కమలమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందిగాం, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌతుపురంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లోకేష్, గోవింద్ ప్రకృతివ్యవసాయం ఆవశ్యకత, నవధాన్యాలు సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ఏ-గ్రేడ్ మోడల్ కిచెన్ గార్డెన్ తదితర అంశాలపై వివరించారు.కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి వజ్జ గోపాలకృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

టెక్కలి, మే 15(ఆంధ్రజ్యోతి):కోటబొమ్మాళి మండలంలోని తాటిపర్తిలో 286 మందికి టీడీపీ సభ్యత్వకార్డులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుమారుడు కృష్ణమోహన్‌నాయుడు, మెండ వెంకటేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారణ

నరసన్నపేట, మే 15(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారించవచ్చని కేర్ అండ్ సపోర్ట్ కేంద్ర సమన్వయకర్త బి.రామప్రసాద్ తెలిపారు. గురువారం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కనకదుర్గ కళాబృందం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.కార్యక్రమంలో చంద్రశేఖర్, యూత్ క్లబ్ బెజ్జిపురం, టీఐపీయూ ఇంటర్వెన్షన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

నందిగాం, మే 15(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం ఇండోర్ క్రీడలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటుచేశారు.

●టెక్కలి, మే 15(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించడం, ఆలోచనా పరిధిని విస్తృతం చేయడం పప్పెట్రీషో లక్ష్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. టెక్కలిలో ప్రజాచైతన్య కళాసమితి ఆధ్వర్యంలో 20 రోజులపాటు నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి వినోద శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచతంత్రం కథలకు సంబంధించి బొమ్మలతో అభినయం చేస్తూ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో చిలుకు కృష్ణారావు, ఎం.పద్మనాభం, యు.గణపతిరావు, మూల తాతయ్య, హరిశ్చంద్రరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

జలుమూరు, (సారవకోట) మే 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై మాట్లాడే హక్కు వైసీపీ నాయకులకు లేదని నరసన్నపేట ఐటీడీపీఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు పేర్కొన్నారు. గురువారం సారవకోటలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకుడు నక్క తులసీదాసు స్థాయి మరచి విమర్శలుచేయడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో రేషన్ సరిగ్గా అందడం లేదని విమర్శించడంలో వాస్తవం లేదన్నారు. బైదలాపురం వంతెనకు టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు మంజూరుచేసి పనులు యుద్ధప్రాతిపదికను పూర్తిచేశారన్నారు. వైసీపీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనట్లు చెప్పకోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో గ్రామీణ రహదారులు పక్కా రహదారులుగా మారాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు జయరాం, ఇప్పిలి హేమసుందర్ పాల్గొన్నారు.

రచ్చబండ పరిశీలన

జలుమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనేటికొత్తూరులో ఇటీవల కూలగొట్టిన రచ్చబండను ఎంపీడీవో కె.అప్పలనాయుడు, తహసీల్దార్ జన్ని రామారావు గురువారం పరిశీలించారు. గ్రామంలో రెండు దశాబ్దాల కిం దట నిర్మించిన రచ్చబండను కొంతమంది కూలగొట్టడం పై ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోర సింహాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో ఇరువర్గాలను పిలిపించి తగాదా పరిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, హెచ్‌సీ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంస

టెక్కలి, మే 15(ఆంధ్రజ్యోతి):టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలకు చెందిన జె.నవ్య పదోతరగతి ఫలితాల్లో 590మార్కులు సాధించడంతో గురువారం విజయవాడలో జరిగిన అభినందన సభలో ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందుకుంది. విజయవాడలో జరిగిన అభినందన సభలో బీసీశాఖమంత్రి ఎస్.సవిత, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, ఎంజేపీ ఏపీపాఠశాల సెక్రటరీ మాధవీలత, పూర్వపు సెక్రటరీ కృష్ణమోహన్ తదితరులు చేతులమీదుగా నవ్యకు ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందజేసినట్లుపాఠశాల ప్రిన్సిపాల్ పూసపాటి సుధారాణి తెలిపారు. నవ్యకు ప్రశంసాపత్రం లభించడంతో పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



